RNI No - APTEL/2022/81596

# జనోదయ




కరీంనగర్ మంగళవారం 03.03.2026 సంపుటి : 03 సంచిక : 87 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Tuesday 03.03.2026 Volume: 03 Issue 87 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## జల్లికట్టులో విషాదం

### ఎద్దు పొడిచి ముగ్గురి మృతి



**తమిళనాడు, మార్చి 02:** శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జల్లికట్టు సందర్భంగా సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని.. అందువల్లే ఇలా జరిగిందంటూ స్థానికులతో పాటు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.మరో వైపు ఈ ఘటనలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇప్పటికే ఆసుపత్రికి చేరుకున్నారు. తమిళనాడులో జల్లికట్టు పోటీలను సంప్రదాయ క్రీడగా ప్రజలు జరుపుకొంటారు.



# ప్రపంచ యుద్ధం

### మలుపు తీసుకుంటోన్న పశ్చిమాసియాలో యుద్ధం

- అమెరికాకు తోడుగా రంగంలోకి బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ
- ఇరాన్‌కు మద్దతుగాహెజ్బొల్లా, ఇరాకీ సాయుధ మిలీషియా
- దాడులు నాలుగైదు వారాలు కొనసాగుతాయన్న ట్రంప్
- ఇరాన్‌పై కొన్ని అరబ్ దేశాలూ దాడి చేస్తాయని ప్రకటన
- చర్చల కోసం ప్రయత్నించట్లేదని స్పష్టం చేసిన ఇరాన్
- ఇజ్రాయెల్, ఇరాక్, గల్ఫ్ దేశాల్లో ఇరాన్ క్షిపణి దాడులు
- ఆరామ్‌కో చమురు రిఫైనరీపై దాడి.. సరఫరా బంద్
- ఇరాన్‌పై మరింతగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్
- లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపైనా భీకర దాడి
- హోర్ముజ్ మార్గంలో చమురు నౌకలపై డ్రోన్ దాడులు
- భారతీయుడు సహా ఇద్దరి మృతి
- కూలిపోయిన మూడు అమెరికా ఎఫ్-15ఈ ఫైటర్లు
- వాటిని కువైట్ పొరపాటున కూల్చేసిందన్న అమెరికా
- వాటిలో ఒక దాన్ని తామే కూల్చేశామన్న ఇరాన్
- ఖమేనీ భార్య మృతి.. తాత్కాలిక సుప్రీం అరాఫీ కూడా చనిపోయినట్లుగా ప్రచారం

పశ్చిమాసియాలో యుద్ధం మరో తీవ్రమైన మలుపు తీసుకుంటోంది. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై విరుచుకుపడితే.. ఇరాన్ బదులుగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. సోమవారం ఇరాన్‌కు మద్దతుగా లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ, ఇరాకీ సాయుధ మిలీషియా గ్రూపులు తెరపైకి వస్తే.. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్‌కు తోడుగా ఫ్రాన్స్, యూకే, జర్మనీ రంగంలోకి వచ్చాయి. ఈ మేరకు మూడు దేశాలు సోమవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి.

5లో..

## నేటి తరానికి దుద్దిళ్ల శ్రీపాదరావు స్ఫూర్తి

### కర్ణాటక స్పీకర్ యూటీ ఖాదర్ ఫరీద్



**హైదరాబాద్, జనోదయ: మార్చి 2 :** స్పీకర్ వ్యవస్థకే వన్నె తెచ్చిన విలువల శిఖరం శ్రీపాదరావు అని కర్ణాటక స్పీకర్ యూటీ ఖాదర్ ఫరీద్ కొనియాడారు. రాజకీయాల్లో పదవి అంటే కిరీటం కాదని, బాధ్యతని చాటి చెప్పిన దార్శనికుడని శ్లాఘించారు. హైటెక్‌సిటీలోని శిల్పాకళా వేదికలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ నుంచి స్పీకర్ వరకు ఎదిగిన శ్రీపాదరావు రాజకీయ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు.తన తండ్రి ఆశయసాధనకు చిత్తశుద్ధితో కృ షిచేస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మకాన్ సింగ్, ఆది శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్‌రావు, గండ్ర సత్యనారాయణ, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## బడులకు హోలీ సెలవు నేడే

**హైదరాబాద్, మార్చి 2 :** స్కూళ్లకు హోలీ పండుగ సెలవుపై నెలకొన్న గందరగోళానికి విద్యాశాఖ ఎట్టకేలకు తెరదించింది. మంగళవారమే హోలీ సెలవుదినంగా ప్రకటించింది. విద్యాశాఖ విడుదల చేసిన అకాడమిక్ క్యాలెండర్‌లో మార్చి 4న హోలీ పండుగ సెలవుగా ప్రకటించారు. అయితే ప్రభుత్వం మార్చి 3న సెలవుగా ప్రకటించింది. అకాడమిక్ క్యాలెండర్‌లో ఒకలా.. సర్కార్ సెలవుల జాబితా మరోలా ఉండటం గందరగోళానికి దారితీసింది. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ స్పందించి మార్చి 3న సెలవు ప్రకటించారు. రంజాన్, శ్రీరామనవమి సెలవులపైనా సందిగ్ధం నెలకొనగా.. దీనిపైనా నవీన్ నికోలస్ స్పష్టత ఇచ్చారు. ఈ రెండు పండుగలకు కూడా ప్రభుత్వం ప్రకటించిన సెలవులనే అనుసరించాలని ఆదేశించారు. అకాడమిక్ క్యాలెండర్‌లో మార్చి 20న రంజాన్, 26న శ్రీరామనవమి సెలవులుగా ప్రకటించారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్‌లో మార్చి 21న రంజాన్, 22న రంజాన్ తదుపరి రోజు, మార్చి 27 శ్రీరామనవమి



సెలవులుగా ప్రకటించారు. గందరగోళం నెలకొనడంతో 21న రంజాన్, 27న శ్రీరామనవమి సందర్భంగా బడులకు సెలవులుగా ప్రకటించారు.

## నేడు బ్లడ్‌మూన్



### మధ్యాహ్నం 3.20 నుంచి చంద్రగ్రహణం

### తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6 తర్వాత దర్శనం

**హైదరాబాద్ , మార్చి 2 :** వినువీధిలో నేడు (మంగళవారం) చంద్రగ్రహణం కనువిందు చే యనున్నది. 'బ్లడ్ మూన్'గా పిలిచే ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు హైదరాబాద్ వా సులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. అలాంటి వారి కోసం బిర్లా ప్లానిటోరియం, ఓయూ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3.20 గంటలకు 'బ్లడ్ మూన్' దశ ప్రారంభమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత దీన్ని చూడొచ్చు. దేశంలోని చాలా ప్రాంతాల్లో 7 నుంచి 25 నిమిషాలపాటు దీన్ని చూసేందుకు వీలుంటుందని ఖగోళ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీనివల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. దీనినే 'బ్లడ్ మూన్' అని పిలుస్తారు. ఎలాంటి కండ్లజోడు, ఇతర రక్షణ పరికరాలు అవసరం లేకుండా నేరుగా దీన్ని చూడొచ్చని, మళ్లీ ఇలాంటి చంద్రగ్ర హణం 2028 జులై 6న ఏర్పడే అవ కాశం ఉన్నదని శాస్త్రవేత్తలు తెలిపారు.

# కళా రంగంలో సమస్యలను పరిష్కరించాలి



**జనోదయ,హనుమకొండ, మార్చి 02:**

సమగ్ర సాంస్కృతిక విధానం కావాలని, కళారంగంలోనున్న సమస్యలను పరిష్కరించాలని ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్యమండలి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టేపాక రవి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజానాట్య మండలి కళాకారులు తమ ఆటపాట దూంధాం లతో ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినటువంటి కళాకారులను అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం కళాకారులకు అరకొర ఉద్యోగాలు ఇచ్చి నిజమైన కళాకారులను గుర్తించకుండా నిర్లక్ష్యం చేసిదన్నారు.అలాగే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారుల ఉద్యోగాలు భర్తీ చేయకుండా, అదేవిధంగా కళాకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా చిన్నచూపు చూస్తున్నదని, ఏదైనా ఒక దేశ సాంస్కృతిక జీవనశైలి ఆ దేశపు సాంస్కృతిక రంగాన్ని తెలియ చెప్తుందని, ఆనాటి నుండి వస్తున్న సాంప్రదాయ కళా సంపద ఎంతో ఉంది శ్రమ జీవుల జీవితాల నుండి ఉద్భవించిన జీవితం అని, జానపద కళలు మనకు వారసత్వంగా వచ్చా యని, అందుకే తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో వివిధ రంగాల కళాకారులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, క్రీడారంగంలోని క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ఉన్నట్టుగానే కళాకారులకు కూడా ఉద్యోగాల్లో సాంస్కృతిక కోటా కింద ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగ కళాకారులు ఎక్కువగా ఉండటం వలన వారికి ఉద్యోగాలు కల్పించుటకు ప్రభుత్వం సంఖ్యతో నిమిత్తం లేకుండా అర్హులైన కళాకారులకు ఉద్యోగాల సంఖ్య పెంచి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారులు పెండ్యాల గట్టయ్య, తాటికాయల మమత, భూషణం, రొంటాల దేవా, కరుణాకర్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని కలిసిన రామగుండం ఎమ్మెల్యే




**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 2:**

తెలంగాణ రాష్ట్రాల నూతన జిల్లా అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులకు వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతుల కార్యక్రమానికి సోమవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవ్వడం జరిగింది. హెలిఫ్యాడ్ వద్ద రాహుల్ గాంధీ ఘనస్వాగతం పలికిన అనంతరం రెండు రాష్ట్రాల ఉమ్మడి సమావేశంలో పాల్గొని సభ్యులకు పలు కీలక అంశాలపై దిశా- నిర్దేశం చేయడం జరిగింది. ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ పాల్గొనగా, రామగుండం ఎంఎల్ఏ ఎంఎస్ రాజ్ ఠాకూర్, ఆయన కుటుంబ సభ్యులు రాహుల్ గాంధీని ప్రత్యేకంగా వేదికపై కలిశారు.

## పిల్లలకు మానసిక ఆరోగ్యం అవసరం

**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**జనోదయ : ఉమ్మడి ఆదిలాబాద్**

పిల్లలకు మానసిక ఆరోగ్యము అవసరమని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, వైద్య శాఖ అధికారులతో కలిసి కార్యక్రమ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలలో మానసిక పరివర్తన కలుగజేయడం, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయడం, అవసరం పౌష్టికాహారము, జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవడం అలవాటు చేయాలని తెలిపారు. మానసిక ఆరోగ్యంలో ఎలాంటి సందేహాలున్న 14416 నంబర్‌లో సంప్రదించినట్లయితే ప్రత్యేక వైద్య నిపుణులచే ఆరోగ్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డా. ఏ ప్రసాద్, డిపిఓ ప్రశాంతి, సిహెచ్ఓ లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, సంపత్ కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లాలోని ఆర్ బి ఎస్ కే వైద్యులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీపాదరావు జయంతి

**జనోదయ, మందమర్రి మార్చి 2:**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు 91 వ జయంతి వేడుకలు సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీపాదరావు చిత్రపటానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు శ్రీపాదరావు అని ఆయన సేవలను కొనియాడారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. శ్రీపాదరావు జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్పూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జివిల్ ప్రసాద్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, డీజీఎం పర్సనల్ అశోక్, సీఎంఓఏఐ జాయింట్ సెక్రెటరీ రవి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఐటియుసి జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ రమణ పాల్గొన్నారు.

**ఏరియా వర్క్ షాప్‌లో...**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 91వ జయంతి వేడుకలు ఏరియా వర్క్ షాప్‌లో ఘనంగా నిర్వహించారు. వర్క్ షాప్ డివైజిఎం దూప్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐటియుసి వర్క్ షాప్ అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ ఎగ్గేటి రాజేశ్వరరావు మాట్లాడుతూ మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభ స్పీకర్ గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సేవలందించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వర్క్ షాప్ ఇంజనీర్లు సదానందం, శ్రీనివాస్, సెక్షన్ ఇన్చార్జులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏరియాలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి

**-ఏరియా జిఎం రాధాకృష్ణ -**



**జనోదయ, మందమర్రి:** ఏరియాలోని భూగర్భ, ఉపరితల గనుల్లో గత ఫిబ్రవరి మాసానికి గాను నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంల్లో 93 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని ఏరియా సింగరేణి జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. జిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిఖనిలో 10 వేల టన్నులకు గాను 399 టన్నులు, కేకే 5 గనిలో 19 వేల 500 టన్నులకు గాను 20193 టన్నులు,కాసిపేట గనిలో 19 వేల టన్నులకు గాను 12 వేల 544 టన్నులు, కాసిపేట 2 గనిలో 16 వేల టన్నులకు గాను 11627 టన్నులు, కేకే ఓసిపి లో 1.6 లక్షలకు గాను 1.63 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. ఏరియాలో 46 రేకుల బొగ్గు రవాణా జరిగి నట్టు తెలిపారు. భూగర్భ గనులలో ఉద్యోగుల గైర్హాజరు మూలంగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగు తుందని, ఈ సమస్యను పరిష్కరించడానికి యూనియన్ నాయకులతో కలిసి ముందుకు వెళ్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు.ఉద్యోగులు అధికారులు యూనియన్ నాయకుల సహాయ సహకారాలతో భూగర్భగనుల్లో 100% బొగ్గు ఉత్పతి సాధించడానికి కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా గైర్హాజరు శాతాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి ఉద్యోగి ఉత్పత్తి పనిగంటలను సద్వినియోగం చేసుకొని సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. వార్షిక సంవత్సరం ముగిసేందుకు మరో నెల రోజుల సమయం ఉన్నందున ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యం అధిగమించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు. జిఎం జి ఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, ఐఈడి డీజీఎం. కిరణ్ కుమార్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, సీనియర్ పిఓ సత్యనారాయణలు పాల్గొన్నారు.




# ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం

### గంగాధరలో ఘనంగా నిర్వహణ



**జనోదయ : గంగాధర, మార్చి 2:** గంగాధర మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ పోటీలకు చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి క్రీడాకారులు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మహోత్సవాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ విభాగంలో 10 జట్లు, వాలీబాల్‌లో 18 జట్లు, ఖో–ఖోలో 6 జట్లు పోటీపడ్డాయి. నియోజకవర్గ స్థాయిలో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన జట్లు ఈ నెల 6న జరిగే పార్లమెంట్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. టీమ్‌ల నమోదు ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మండల స్థాయిలో, మార్చి 1 నుంచి 3 వరకు అసెంబ్లీ స్థాయిలో, మార్చి 5 నుంచి 7 వరకు పార్లమెంట్ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 8, 2026న కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# గుడిసె వాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

### సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి




**జనోదయ,హనుమకొండ, మార్చి 02:** దేశంలోని పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. పలువేల్పుల గ్రామంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద సిపిఐ శాఖ సమితి సమావేశం ఆ పార్టీ శాఖ కార్యదర్శి గొర్రె నందిని అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఆచరణలో అరాకొర అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నాయని, స్థానికంగా కనీస మౌలిక సదుపాయాలు సైతం కల్పించకపోవడం బాధాకరమన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్య దర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, నాయకులు గూగులోత్ సురేష్, పాకాల సంతోష్, పులి ముత్తయ్య, నతనీయల్, బొక్క ఈశ్వర, పులి యశోద, దేవరకొండ జయ, గుగులోతు పర్లిక, పుష్ప పాల్గొన్నారు.

# శ్రీపాద చేసిన సేవలు వెల కట్టలేనివి

### - రామగుండం మేయర్ మహంకాళి

**జనోదయ, గోదావరిఖని, మార్చి 2:** అభివృద్ధి ప్రదాత, అజాత శత్రువు మాజీ సభాపతి శ్రీ పాదరావు అని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. సోమవారం శ్రీపాద రావు జయంతి పురస్కరించుకొని రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి ఆయన చేసిన సేవలను, పని తీరును తెలుగుదేశం పార్టీ స్థాపకుడు, నాటి ముఖ్యమంత్రి ఎన్. టి.రామారావు కొనియాడారని అన్నారు. సర్పంచ్ స్థాయి నుండి సభా పతి స్థాయికి ఎదిగిన గొప్ప నాయకుడు మన జిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టుగా నామకరణం చేయడం జరిగిందని అన్నారు. శ్రీ పాద రావు వారసుడిగా రాజకీయాల్లో అడుగిడిన మంత్రి శ్రీధర్ బాబు కూడా రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తూ, పరిశ్రమల స్థాపనకు లక్షల కోట్ల రూపాయలు విదేశీ పెట్టుబడులు తెస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని రామగుండంలో తమ పాలన కొనసాగుతుతీదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పా తపెల్లి ఎల్లయ్య, నగరపాలక సంస్థ ఎస్ ఇ గురువీర, ఇ ఇ రామన్, డిప్యూ టీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నా రు. అంతకు ముందు గోదావరిఖని బస్ స్టాండ్ ఎదుటగల శ్రీ పాదరావు విగ్రహానికి పూల మాల నివాళులర్పించారు.



# మహిళలు పోష్ యాక్ట్ పై అవగాహన కలిగిఉండాలి

### -ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ-



**జనోదయ, మందమర్రి మార్చి 2:** పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నివారణ, పరిష్కారాలకు సంబంధించిన పోష్ యాక్ట్ పై మహిళా ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ అన్నారు. ఏరియా లోని జీఎం కార్యాలయంలో సోమవారం మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్, సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో సింగరేణి అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో జిఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళలందరికీ మహిళల హక్కులు, చట్టాలపై రాత పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై, మహిళలకు ప్రశ్నాపత్రాలు అందజేసి, పరీక్ష ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సెక్సువల్ అరెస్మెంట్ ఆఫ్ ఉమెన్ యట్ వర్క్ ప్లేస్ యాక్ట్ – 2013 ప్రకారం మహిళలకు లైంగికంగా పని స్థలాల్లో ఎలాంటి ఇబ్బందులు కలిగిన ఈ యాక్ట్ ద్వారా అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ రాత పరీక్షల్లో ముగ్గురిని ఎంపిక చేసి, వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులచే ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డిజిఎం అశోక్, మదర్ థెరిస్సా టిఎస్వీవో అధ్యక్షురాలు కె భువనేశ్వరి, అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యులు, ఏరియా డివైఎఫ్ఎం ఎఫ్ అండ్ ఏ సరిత, ఏరియా ఎస్టేట్ అధికారిని నవనీత, సీనియర్ పిఓ రవళి, ఇన్వెజిలేటర్ రూపలత, అనిత, రమణకుమారి, ఏరియా సీనియర్ పిఓ సత్యనారాయణ,సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**జనోదయ , ములుగు, మార్చి 02:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేవిధంగా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారి స్థాయిలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ వంటి అంశాలను సమీక్షిస్తానని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్లో ఉంచవద్దని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మండల ప్రత్యేక అధికారులు, ఎంపి డి ఓ లు, ఎంపి ఓ లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇళ్లను వెంటనే మిగతా పనులు పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని పనులు పూర్తయిన ఇండ్లను వారానికి 10 చొప్పున గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కమ్మని విందు రెస్టారెంట్, కర్రీ పాయింట్‌ని ప్రారంభించిన బాలీవుడ్ యువ హీరో ఆకాశ్ పూరి

**జనోదయ : శేరిలింగంపల్లి, మార్చి 2:** మై హోమ్ గేట్ ఎదురుగా, మజీరా పైప్‌లైన్ రోడ్, ఆర్టీసీ కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పక్కన (2వ అంతస్తులో) నూతనంగా ప్రారంభమవుతున్న కమ్మని విందు రెస్టారెంట్, కర్రీ పాయింట్‌ను సోమవారం ముఖ్యఅతిథిగా హాజరైన బాలీవుడ్ యువ హీరో ఆకాష్ పూరి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంప్రదాయ వంటకాలు, అసలైన రుచులు, ఆతిథ్య సౌజన్యంతో వినియోగ దారులకు ప్రత్యేక అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ ప్రారంభోత్సవ వేడుకను విజయవంతం చేయాలని ఆహ్వానం పలికారు. నూతనంగా ప్రారంభమవుతున్న ఈ రెస్టారెంట్‌లో వివిధ రకాల వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో పాటు కర్రీ పాయింట్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మదినగూడ ప్రాంత ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ రోజున ప్రత్యేక ఆఫర్లు, అతిథులకు ఆతిథ్య విందు వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రాంతీయ ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమాని, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు




# సంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకుందాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**జనోదయ, హనుమకొండ, మార్చి 02:** సంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు. హోలీ పండుగ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు ప్రజలకు పలు సూచనలు చేస్తూ సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తూ హోలీ పండుగను ప్రశాంతవంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హోలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళవద్దని, ఒక వేళ వెళ్ళాసి వస్తే తగు జాగ్రత్తలను పాటించాలని, ప్రధానముగా బహిరంగ ప్రదేశాలపై, అనుమతి లేకుండా వ్యక్తులపై, మహిళలు, యువతులు,వాహనాలపై రంగులు చల్లడం బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తప్పవని. హోలీ పండుగను సజావుగా జరుపుకొనేందుకు వరంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించబడుతుందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మియాపూర్ చైన్ స్నాచింగ్ కేసు ఛేదించిన పోలీసులు

**ఇద్దరు నిందితుల అరెస్ట్**

**మియాపూర్ డిఐ రమేష్ నాయుడు**

**జనోదయ: శేరిలింగంపల్లి మార్చి 2 :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనను పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మియాపూర్ డిఐ రమేష్ నాయుడు తెలిపారు. డిఐ వివరాల ప్రకారం, మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన 36 ఏళ్ల గృహిణి గత నెల 25న మియాపూర్‌లోని వశిష్ట జూనియర్ కళాశాలలో చదువుతున్న తన కుమార్తెను కలిసేందుకు వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం కళాశాల రోడ్‌లో బస్ స్టాప్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న సుమారు 70 గ్రాముల మంగళసూత్రం గొలుసును అకస్మాత్తుగా లాగి పరారయ్యారు. ఈ ఘటనలో గొలుసులో సుమారు 10 గ్రాముల బంగారు భాగాన్ని నిందితులు అపహరించగా, మిగిలిన సుమారు 60 గ్రాముల భాగం బాధితురాలి చీరలో చిక్కుకుని ఆమె వద్దే మిగిలింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు.




పైపులైన్ రోడ్ ప్రాంతంలో నివసిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభయ్ కుమార్ ధుబే (30), జార్ఖండ్‌కు చెందిన ఆకాశ్ కుమార్ రాజక్ (18)లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఫుడ్ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తూ, ఒంటరిగా కనిపించే మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. చైన్ స్నాచింగ్‌కు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, దొంగిలించిన 10 గ్రాముల బంగారు ఆభరణాన్ని పోలీసులు రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై నడిచేటప్పుడు చుట్టుపక్కల పరిస్థితులను గమనించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితులలో డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని పోలీసులు పేర్కొన్నారు.

# 24వ వార్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



**జనోదయ మందమర్రి మార్చి 2:** పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని మందమర్రి (వి) 24వ వార్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని జన సేన పార్టీ జిల్లా నాయకుడు ఆవుల సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణ మున్సి పాలిటీ కార్యాలయం లో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 24వ వార్డులో సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని వాపోయారు. వెంటనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఆవుల శ్రవణ్, రొడ్డ శేఖర్‌లు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో రెండోరోజు బీఆర్ఎస్ శ్రేణులు పాదయాత్ర

**-సుభాష్ చంద్రబోస్ నగర్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హామీ**

**జనోదయ : శేరిలింగంపల్లి, మార్చి 2 :** బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచన మేరకు ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర రెండో రోజు నిర్వహించారు. రోడ్ నెంబర్ 1 వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్రలో పార్టీ ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాల లోపాలు, గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదల ఇబ్బందులు వంటి సమస్యలను స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తామని బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పించారు. ప్రజల సమస్యలను విస్మరించి స్వలాభం కోసం పార్టీ మారారని, కాలనీవాసుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల హామీలు నెరవేర్చాలని, డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, కలిదిండి రోజా, గోపరాజు శ్రీనివాసరావు, శివరాజ్ ముదిరాజ్, కాసాని శ్రీధర్, జహంగీర్, రవి, కృష్ణా నాయక్, తిరుపతి నాయక్, గోపాల్ నాయక్, నర్సింగ్, వంశీ, సుధాకర్, రాజు, శ్రీశైలం, వరలక్ష్మి, రమేష్, హనుమంత్, శ్రీను, చందు, వర్మ పాల్గొన్నారు.








# యుద్ధం..భీకరం

పశ్చిమాసియాలో యుద్ధం మరో తీవ్రమైన మలుపు తీసుకుంటోంది. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై విరుచుకుపడితే.. ఇరాన్ బదులుగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. సోమవారం ఇరాన్‌కు మద్దతుగా లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ, ఇరాకీ సాయుధ మిలీషియా గ్రూపులు తెరపైకి వస్తే.. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్‌కు తోడుగా ఫ్రాన్స్, యూకే, జర్మనీ రంగంలోకి వచ్చాయి. ఈ మేరకు మూడు దేశాలు సోమవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి.



**● అమెరికాకు తోడుగా రంగంలోకి బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ● ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా, ఇరాకీ సాయుధ మిలీషియా ● దాడులు నాలుగైదు వారాలు కొనసాగుతాయన్న ట్రంప్ ● ఇరాన్‌పై కొన్ని అరబ్ దేశాలూ దాడి చేస్తాయని ప్రకటన ● చర్చల కోసం ప్రయత్నించట్లేదని స్పష్టం చేసిన ఇరాన్ ● ఇజ్రాయెల్, ఇరాక్, గల్ఫ్ దేశాల్లో ఇరాన్ క్షిపణి దాడులు ● ఆరామ్‌కో చమురు రిఫైనరీపై దాడి.. సరఫరా బంద్ ● ఇరాన్‌పై మరింతగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ ● లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపైనా భీకర దాడి ● హోర్ముజ్ మార్గంలో చమురు నౌకలపై డ్రోన్ దాడులు ● భారతీయుడు సహా ఇద్దరి మృతి ● కూలిపోయిన మూడు అమెరికా ఎఫ్-15ఈ ఫైటర్లు ● వాటిని కువైట్ పొరపాటున కూల్చేసిందన్న అమెరికా ● వాటిలో ఒక దాన్ని తామే కూల్చేశామన్న ఇరాన్ ● ఖమేనీ భార్య మృతి.. తాత్కాలిక సుప్రీం అరాఫీ కూడా చనిపోయినట్లుగా ప్రచారం**

**దుబాయ్, మార్చి 2:** పశ్చిమాసియాలో యుద్ధం మరో తీవ్రమైన మలుపు తీసుకుంటోంది. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై విరుచుకుపడితే.. ఇరాన్ బదులుగా ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేస్తోంది. సోమవారం ఇరాన్‌కు మద్దతుగా లెబనాన్‌లోని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ, ఇరాకీ సాయుధ మిలీషియా గ్రూపులు తెరపైకి వస్తే.. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్‌కు తోడుగా ఫ్రాన్స్, యూకే, జర్మనీ రంగంలోకి వచ్చాయి. ఈ మేరకు మూడు దేశాలు సోమవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి. హెజ్బొల్లా ఆదివారం రాత్రి ఉన్నట్టుండి ఇజ్రాయెల్‌పైకి దాడికి దిగడంతో.. ప్రతిగా ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు మద్దతుగా యూకే తెరపైకి రావడంతో సైప్రస‌లోని యూకే సైనిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. అంతేకాదు భారీ స్థాయిలో క్షిపణి దాడులు కూడా చేస్తామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. మరోవైపు తమ ప్రాంతాలపై దాడులు ఆపకుంటే.. తాము ఇరాన్‌పై దాడికి దిగుతామని సౌదీ, కువైట్, ఖతార్, బహ్రెయిన్ హెచ్చరించాయి. ఇజ్రాయెల్, అమెరికా ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్, ఇస్ఫహాన్ నగరాల్లో భీకర దాడులకు దిగాయి. ఫైటర్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. మొత్తంగా ఇరాన్‌లో 130 పట్టణాలపై దాడులు చేశాయి. నౌకాదళ స్థావరాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ క్షిపణి ప్రయోగ వ్యవస్థలు, డ్రోన్ స్థావరాలపై ప్రత్యేక దృష్టిపెట్టి విధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) సోమవారం ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన రెండు సుఖోయ్-24 ఫైటర్లను కూల్చేశామని ఖతార్ రక్షణ శాఖ ప్రకటించింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో మృతుల సంఖ్య 555కు చేరిందని రెడ్ క్రిసెంట్ సంస్థ వెల్లడించింది. టెహ్రాన్‌లోని గాంధీ ఆస్పత్రి సహా ఇరాన్‌వ్యాప్తంగా 9 ఆస్పత్రులపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఇరాన్ పార్లమెంట్ హెల్త్ కమిటీ సభ్యురాలు ఫాతిమా బేగీ తెలిపారు. కాగా ఖమేనీ మరణంతో ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన అయతుల్లా అలీరెజా అరాఫీ సోమవారం ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మరణించారనే ప్రచారం జరిగింది. కొన్ని ఇజ్రాయెల్ వార్తా సంస్థలు, సోషల్ మీడియాలో దీనిపై కథనాలు వచ్చాయి. కానీ అంతర్జాతీయ వార్తా సంస్థలుగానీ, ఇరాన్ అధికారిక మీడియాగానీ దీనిని ధ్రువీకరించలేదు. ఇక ఇరాన్ కొత్త నేతలు తనతో చర్చలు జరిపేందుకు ముందుకు వచ్చారన్న ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ భద్రతా మండలి చీఫ్ అలీ లరిజని ఖండించారు. తాము అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేస్తుండటంతో అమెరికా తన ఫైటర్లను సైప్రస్‌కు తరలిస్తోందని.. అక్కడి నుంచి కూడా వెళ్లిపోయేలా సైప్రస్‌పై భారీ స్థాయిలో క్షిపణి దాడులు చేపడతామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్ ఇబ్రహీం జబారి సోమవారం ప్రకటించారు. ఇక బహ్రెయిన్, ఖతార్, దుబాయ్, అబుధాబి, సౌదీ, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ వందలాది క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. చాలా వరకు క్షిపణులను మధ్యలోనే అడ్డుకున్నా కొన్ని మాత్రం లక్ష్యాలను తాకాయి. సోమవారం ఆ దేశాల్లోని పలు ప్రాంతాల్లో పేలుళ్లు జరిగాయి. శని, ఆదివారాల్లో 172 క్షిపణులు, 817 డ్రోన్లను విజయవంతంగా అడ్డుకున్నామని యూఏఈ ప్రకటించింది. ఇక 'ట్రూ ప్రామిస్ 4 ఆపరేషన్'లో భాగంగా పెద్ద సంఖ్యలో ఖైబర్ క్షిపణులను ఇజ్రాయెల్‌పై ప్రయోగించామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్, జెరుసలేంలోని ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేశామని తెలిపింది. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం, ఎయిర్ ఫోర్స్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడి చేశామని పేర్కొంది. అయితే ఇది తప్పుడు ప్రచారమని, ఇరా న్ క్షిపణులేవీ తాకలేదని ఇజ్రా యెల్ ప్రకటించింది. ఇక ఇరాన్ క్షిపణి దాడిలో ఇజ్రా యెల్‌లోని బీట్ షెమటష‌లో తీవ్ర నష్టం జరిగింది. 9 మంది మరణించగా.. మరో 11 మంది జాడ తెలియడం లేదని అధికారవర్గాలు తెలిపాయి. మరోవైపు ఇరాక్ లోని బాగ్దాద్‌లో అమెరికా రాయబార కార్యాల యం, ఎర్బిల్ నగరంలోని విమానాశ్రయంపై ఇరాన్ అను కూల 'ఇస్లామిక్ రెసిస్టెన్స్' ఉగ్రవాద సంస్థ 23 డ్రోన్ దాడులు చేసింది. ఖమేనీని చంపినం దుకు ప్రతీకారంగా దాడులు చేపట్టినట్టు ప్రకటించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితి, ఇరాన్ ప్రతిదాడులను ఎదుర్కొనేందుకు తాము అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు యూకే, ఫ్రాన్స్, జర్మనీ ప్రకటించాయి. ఈ మేరకు మూడు దేశాల ప్రభుత్వాధినేతలు కీర్ స్టార్మర్, ఎమ్మాన్యుయెల్ మేక్రాన్, ఫ్రెడరిక్ మెర్జ్ ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. తమ మిత్రదేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు దారుణ మని.. పశ్చిమాసియా ప్రాంతంలోని తమ మిలిటరీ సిబ్బంది, పౌరులకు దీనితో ముప్పు ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ దేశ, మిత్రదేశాల ప్రయోజనాలను కాపాడుకునేందు కు ప్రయత్నిస్తామని తెలిపారు. ఇరాన్ క్షిపణు లు, డ్రోన్లతో దాడి చేసే సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. అయితే నేరుగా ఇరాన్‌పై దాడికి దిగుతారా, మిత్రదేశాలకు సహాయకంగా ఉంటారా అన్న వివరాలేమీ వెల్లడించలేదు. నిజానికి ఇరాన్‌పై యుద్ధం లో అమెరికాకు తోడుగా ఉంటామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆదివారమే ప్రకటించారు. ఈ క్రమంలో సైప్రస‌లోని అక్రోటిరిలో ఉన్న యూకే సైనిక స్థావరంపై ఇరాన్ డ్రోన్ దాడి చేసి, రన్‌వేను ధ్వంసం చేసింది. మరోవైపు ఫ్రాన్స్‌లోని నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగినట్టు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పేర్కొన్నారు. యూఏఈ, బహ్రెయిన్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ డేటా సెంటర్లపై డ్రోన్ దాడులు జరిగాయి. యూఏఈ డేటా సెంటర్‌పైకి ఒక వస్తువు దూసుకొచ్చి మంటలు చెలరేగాయని, దానితో డేటా సెంటర్ పనిచేయడం లేదని అమెజాన్ సోమవారం ప్రకటించింది. దానితోపాటు బహ్రెయిన్ డేటా సెంటర్‌లోనూ సమస్యలు తలెత్తాయని తెలిపింది. దీనికి కారణమేంటో వెల్లడించలేదు. సోమవారం అమెరికాకు చెందిన మూడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ మల్టీరోల్ ఫైటర్లు కువైట్‌లో కూలిపోయాయి. అందులో ఒక దానిని ఇరాన్ క్షిపణులతో కూల్చివేసినట్టుగా ఆ దేశ మీడియాలో వార్తలు వచ్చాయి. ఒక ఫైటర్ గింగిరాలు తిరుగుతూ నేలకూలుతున్న వీడియోలను ప్రసారం చేశాయి. అయితే కువైట్ గగనతల రక్షణ వ్యవస్థలు ఆ విమానాలను పొరపాటున శత్రుదేశానికి చెందినవిగా భావించి కూల్చివేశాయని అనంతరం కువైట్ ప్రభుత్వం, అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించాయి. ఆ ఫైటర్లలోని ఆరుగురు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారని తెలిపాయి. ఒక్కో ఎఫ్-15ఈ ఫైటర్ విలువ రూ.1,100 కోట్లు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో ఒకటైన రాస్ తనురా రిఫైనరీపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేసింది. కొన్నింటిని మధ్యలోనే అడ్డుకోగా రెండు డ్రోన్లు రిఫైనరీని తాకి పేలుళ్లు సృష్టించాయి. దీనితో రిఫైనరీని తాత్కాలికంగా నిలిపివేశామని సౌదీ రక్షణ శాఖ ప్రతినిధి వెల్లడించారు. హోర్ముజ్ జలసంధిలో ఒమన్ తీరానికి సమీపంగా మార్షల్ ఐల్యాండ్స్ జెండాతో ప్రయాణిస్తున్న ఎంకేడీ వ్యోమ్ చమురు ట్యాంకర్ నౌకపై ఇరాన్ సోమవారం డ్రోన్ దాడి చేసింది. దీనితో నౌక ఇంజన్ రూమ్‌లో పేలుడు జరిగి మంటలు చెలరేగాయి. ఒక భారతీయ ఉద్యోగి మృతిచెందారు. ఘటన సమయంలో నౌకలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీలు, ఒక ఉక్రెయినీ సహా 21 మంది సిబ్బంది ఉన్నారని ఒమన్ మ్యారీటైమ్ సెక్యూరిటీ సెంటర్ వెల్లడించింది.




## బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేత

అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆదివారంపేట



**జనోదయ : రామగిరి**

రామగిరి మండలం ఆదివారంపేట గ్రామంలో గత శని వారం 21-02-2026 కన్నూరి దుర్గమ్మ మృతి చెందగా వారి ఆర్థిక పరిస్థితి చూసి వారికి చేయూత ఇవ్వాలనే ఉద్దే శంతో సోమవారం రోజున దిన కర్మకు కుమారులైన కన్నూరి ఓదెలు,కన్నూరి పర్వతాలు వారిని పరామర్శించి వారికి,అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కన్నూరి బాపు,కన్నూరి రాజయ్య (ఫిల్డ్ అసిస్టెంట్),కన్నూరి నాగేష్,కన్నూరి రాజు(జర్నలిస్ట్), కన్నూరి మోహన్,కన్నూరి రాజేష్,కాంపెల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.